సాక్షి
కాకినాడ
మంగళవారం । 17 । జూన్ । 2025



ఇంటర్ తరువాత కోర్సుల ఎంపికే కీలకం

ఇంటర్ తర్వాత ఏ కోర్సు చదవాలి! ఏ రంగంలో స్థిరపడాలనే సందేహాలు విద్యార్థుల మెదళ్లను తొలిచేస్తుంటాయి.


8లో



గోదావరిలో స్నానానికి దిగిన యువకుడి మృతి

ఆదివారం సరదాగా గడపడానికి వెళ్లిన ఏడుగురు స్నేహితులు.. గోదావరిలో స్నానానికి దిగగా, ఒక యువకుడు గల్లంతయ్యాడు.

డెల్టాలకు 8 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 3,300, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,500 కలిపి మొత్తం 8 వేల క్యూసెక్కుల గోదావరి జలాలను విడుదల చేశారు. సముద్రంలోకి 14,640 క్యూసెక్కులు విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయ బదిలీలు పూర్తి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్లలో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులు, పీఈటీలు, ఎస్‌జీటీలకు సంబంధించి 6,572 మంది బదిలీ అయ్యారన్నారు. జెడ్పీ పరిధిలో స్కూల్ అసిస్టెంట్ల నుంచి ప్రధానోపాధ్యాయులుగా 96 మంది, మున్సిపల్ కార్పొరేషన్ స్కూళ్లలో 10 మంది పదోన్నతి పొందారని తెలిపారు. ప్రభుత్వ యాజమాన్యంలో సెకండరీ గ్రేడ్ నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా 204 మందికి పదోన్నతి కల్పించామని రమేష్ తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు 681 అర్జీలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు 681 అర్జీలు సమర్పించారు. వారి నుంచి కలెక్టర్ షణ్మోహన్ అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్ అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని ఈ సందర్భంగా అధికారులను ఆయన ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులో పేర్ల మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, రీ సర్వే, ఆక్రమణల తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం, తల్లికి వందనం ఆన్‌లైన్ తదితర సమస్యలపై అర్జీలు అందాయని కలెక్టర్ వివరించారు.

కేతన్ గార్గ్ బదిలీ



రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ గ్రేటర్ విశాఖపట్నం నగర పాలక సంస్థ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేతన్ గార్గ్ దాదాపు ఏడాది కాలం నుంచి రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్‌గా పని చేస్తున్నారు. ఆయనను బదిలీ చేసిన ప్రభుత్వం ఆ స్థానంలో ఇంకా ఎవ్వరినీ నియమించలేదు. కొత్త కమిషనర్ వచ్చేంత వరకూ జిల్లా కలెక్టర్ ప్రశాంతికి కమిషనర్‌గా కూడా అదనపు బాధ్యతలు అప్పగించారు.

అమలాపురంలో విపత్తుల స్పందన దళం స్థావరం



అమలాపురంలోని పాత జైలు భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్: జిల్లాలో తరచుగా సంభవించే తుపాన్లు, గోదావరి వరదలు, చమురు సంస్థల గ్యాస్ లీకేజీ వంటి విపత్కర పరిస్థితుల్లో బాధితులను తక్షణమే ఆదుకుని ప్రాణ నష్టాన్ని నివారించేందుకు విపత్తుల స్పందన దళం స్థావరాన్ని అమలాపురంలో నెలకొల్పుతున్నట్లు కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ వెల్లడించారు. అమలాపురం తహసీల్దార్ కార్యాలయం వెనుక గల పాత సబ్ జైలు భవనంలో ఈ స్థావరం నెలకొల్పాలని కలెక్టర్ నిర్ణయించారు. ఈ జైలు భవనాన్ని కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారులు సోమవారం పరిశీలించారు. ఈ స్థావరంలో దళం నివాసం ఉండి రెస్క్యూ ఆపరేషన్ల నిర్వహణకు సంసిద్ధమై ఉంటుందన్నారు. తహసీల్దార్ పలివెల అశోక్ ప్రసాద్ తోపాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



చేపల విక్రయాలు లేక ఖాళీగా ఉన్న ఉప్పాడ ఫిషింగ్ హార్బర్



ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ వద్ద నిలిచిపోయిన లారీలు



చేపలు పడకపోవడంతో తీరానికి ఖాళీగా చేరుకున్న మత్స్యకారులు



ఇవి దొరకడమే గొప్ప (ఉప్పాడ తీరంలో ఒక బోటులో దొరికిన తక్కువ చేపలను కొనుగోలు చేసిన మత్స్యకార మహిళ)

చేపా చేపా.. ఎందుకు పడలేదు?

- వేట నిషేధం తరువాత చిక్కని చేపలు
- నిరాశతో వెనుదిరుగుతున్న మత్స్యకారులు
- ఒడ్డుకు చేరిన సుమారు 200 బోట్లు
- నిలిచిపోయిన వ్యాపారం
- బోసిపోయిన ఉప్పాడ సాగరతీరం



ఉప్పాడ తీరంలో ఉప్పుటేరుకే పరిమితమైన బోట్లు

పిఠాపురం: రెండు నెలల విరామం అనంతరం ఎంతో ఆశతో వేటకు వెళ్లిన మత్స్యకారులకు నిరాశే మిగిలింది. ఎంత వెతికినా, ఎన్నిసార్లు వల వేసినా ఒక్క చేపా చిక్కకపోవడంతో మత్స్యకారులు వట్టి చేతులతో వెనుదిరుగుతున్నారు. చేపల వేట నిషేధం ఎత్తివేత అనంతరం కాకినాడ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సముద్రంపై చేపల వేటకు వెళ్లిన బోట్లు ఖాళీగా ఒడ్డుకు చేరుకుంటున్నాయి. సుదూర ప్రాంతాలకు వెళ్లిన మత్స్యకారులు సైతం చేపలు పడక ఖాళీ బోట్లతో తిరిగి వచ్చేస్తున్నారు. దీంతో, వేటకు వెళ్లాల్సిన బోట్లు ఎక్కడివక్కడే ఉండిపోయాయి. చేపల క్రయవిక్రయాలతో కళకళలాడాల్సిన ఉప్పాడ తీర ప్రాంతం ఖాళీగా దర్శనమిస్తోంది.

రూ.2 కోట్ల మేర నష్టం

మత్స్యసంతతి వృద్ధి చెందేందుకు వీలుగా బంగాళాఖాతంలో చేపల వేటపై కేంద్ర ప్రభుత్వం రెండు నెలల పాటు విధించిన నిషేధం ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రితో ముగిసింది. అయితే, ఈ నెల 10వ తేదీ నుంచే చాలా మంది మత్స్యకారులు చేపల వేటకు బయలుదేరారు. ఇది ఏటా సాధారణంగా జరిగేదే. దీనికి అధికారులు కూడా అడ్డు చెప్పరు. సముద్రంలో సుదూర ప్రాంతాలకు బోట్లలో 8 నుంచి 12 మంది వరకూ మత్స్యకారులు వేటకు వెళ్తాంటారు. సుమారు రూ.50 వేల విలువైన డీజిల్, రూ.30 వేల ఐస్, ఇతర వంట సామగ్రితో వారు బయలుదేరుతారు. సుమారు 8 నుంచి 10 రోజుల పాటు వేట సాగించి మత్స్య సంపదతో తిరిగి వస్తూంటారు. ఇలా వేటకు వెళ్లిన వారు కూలితో కలిపి ఒక్కో బోటుకు సుమారు రూ.లక్ష నుంచి రూ.1.40 లక్షల వరకూ పెట్టుబడి పెడుతూంటారు. సముద్రంలో 100 నుంచి 200 నాటికల్ మైళ్ల దూరానికి వెళ్లి, సొర వంటి పెద్ద చేపలను వేటాడుతూంటారు. కానీ, ఈసారి అలా వెళ్లిన మత్స్యకారులు చేపలు లేకుండానే ఒడ్డుకు చేరుకుంటున్నారు. సుమారు 200 బోట్లు చేపలు లేకుండానే ఖాళీగా వెనుదిరగడంతో రూ.2 కోట్లు పైగా నష్టం వచ్చిందని మత్స్యకారులు వాపోతున్నారు.

ష్.. వ్యాపారం లే..

వేటకు బోట్లలో వెళ్లిన మత్స్యకారులు వట్టి చేతులతో తిరిగి వస్తూండడంతో తీరాన ఉన్న మత్స్యకారులు తమ బోట్లను ఎక్కడికక్కడే నిలిపివేశారు. దీంతో, చేపల క్రయవిక్రయాలతో కళకళలాడాల్సిన ఉప్పాడ తీరం బోసిపోయింది. జిల్లాలో కాకినాడ హార్బర్ తరువాత యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ సాగర తీరంలోనే చేపల ఎగుమతులు ఎక్కువగా జరుగుతూంటాయి. వేట నిషేధం అనంతరం తొలి రోజు నుంచే చేపల క్రయవిక్రయాలతో ఉప్పాడ కళకళలాడుతూంటుంది. ఇక్కడి నుంచి ప్రతి రోజూ 100 నుంచి 150 లారీల్లో వివిధ రకాల చేపలు 2 వేల టన్నుల వరకూ ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతూంటాయి. వివిధ ప్రాంతాల నుంచి ఇప్పటికే ఉప్పాడ చేరుకున్న పలు లారీలు చేపలు లేకపోవడంతో ఇక్కడే నిలిచిపోయాయి. రూ.కోట్లలో జరిగే వ్యాపార లావాదేవీలు సైతం స్తంభించిపోయాయి. చేపలను నిల్వ ఉంచేందుకు ఇప్పటికే సిద్ధంగా ఉంచిన టన్నులకొద్దీ ఐస్ కరిగిపోతోంది.

ఇలా జరగడం ఇదే తొలిసారి



సాధారణంగా రెండు నెలల నిషేధం తరువాత వేటకు వెళ్తే భారీగా మత్స్య సంపద దొరుకుతూంటుంది. అందుకోసమే నిషేధం పూర్తయిన వెంటనే వేటకు వెళ్లేందుకు ఎక్కువ మంది ముహూర్తాలు చూసుకుని ముందు నుంచీ సిద్ధమవుతూంటాం. ఈ ఏడాది ఏం జరిగిందో ఏమో కానీ ఏ ఒక్క బోటుకూ చేపలు పడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇలా ఎప్పుడూ జరగలేదు. సుమారు రూ.1.20 లక్షల పెట్టుబడితో వేటకు వెళ్తే కనీసం రూ.20 వేల ఖరీదైన చేపలు కూడా పడలేదు. అవి కూడా చిన్న సైజు చేపలు మాత్రమే దొరికాయి. చాలా నష్టం వచ్చింది. నిషేధం తరువాత గతంలో ఎప్పుడూ ఇలా వట్టి చేతులతో తిరిగి వచ్చిన సందర్భాలు లేవు. మాతోపాటు వేటకు వచ్చిన అన్ని బోట్ల వారూ చేపలు పడకపోవడం ఇదే మొదటిసారని అంటున్నారు.

– పట్టా సూరిబాబు, మత్స్యకారుడు, కొత్తపట్నం, ఉప్పాడ శివారు

చేపలు పడటం లేదు



తుపాను వచ్చినప్పుడు సముద్రం అల్లకల్లోలంగా ఉండి కొన్ని రోజులు చేపలు దొరకని పరిస్థితి ఉంటుంది. కానీ, సముద్రం బాగానే ఉంది. కానీ, ఎక్కడకు వెళ్లినా చేపలు పడటం లేదు. కోనాలు, సూరలు, సొరల వంటి చేపల వేటకు వెళ్లిన వారితో పాటు తీరం వెంబడి వేటకు వచ్చిన వారికి కూడా చేపలు అంతగా పడలేదు. ఐదు రోజులైనా ఏ ఒక్కరికీ కనీసం రూ.10 వేల విలువైన చేపలు కూడా పడినట్లు లేదు. అందరం నిరాశతో వెనక్కి వచ్చేశాం. అందరికీ రూ.లక్షల్లో నష్టం వచ్చింది. మామూలు సమయాల్లో ఒక్కోసారి కొందరికి వేట పడదు. కానీ నిషేధం తరువాత ఎక్కువ చేపలు దొరుకుతాయి. కానీ, ఈసారి ఏ ఒక్కరికీ చేపలు పడలేదు.

– వనమాడి ఎల్లారావు, మత్స్యకారుడు, కొత్తపట్నం, ఉప్పాడ శివారు

వాతావరణ పరిస్థితుల వల్ల కావచ్చు

చేపలు పడటం లేదని మత్స్యకారులు ఆందోళనలో ఉన్నారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండటం, సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు వాతావరణ మార్పుల వల్ల కూడా చేపలు పడే అవకాశాలు తక్కువగా ఉంటాయి. సముద్రంలో కలుషిత జలాలు ఎక్కువగా కలవడం వల్ల కూడా ఆయా ప్రాంతాల్లో చేపలు తక్కువగా ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉప్పాడ, కాకినాడ తీరాల నుంచి వెళ్లిన బోట్లు చేపలు పడకపోవడంతో ఒడ్డుకు వచ్చేశాయి. వేటకు వెళ్లాల్సిన బోట్లు వెళ్లలేదు.

– శివరామకృష్ణ, మత్స్యశాఖాధికారి, ఉప్పాడ

అదీ 'మ్యా(మీ)టర్'

- 300 యూనిట్ల పేరుతో 'తల్లికి వందనం' నిలిపివేత
- ఉన్న మీటరు ఒకటి
- 4 నుంచి 14 వరకూ ఉన్నట్లు స్టేట్‌మెంట్లు
- సామర్లకోటలో నిలదీసిన మహిళలు



సామర్లకోట సబ్ స్టేషన్ వద్ద స్టేట్‌మెంట్ల కోసం బారులు తీరిన మహిళలు

సామర్లకోట: తల్లికి వందనం పథకానికి విద్యుత్తు బిల్లుల నిబంధనల సెగ తగిలింది. గడచిన ఆరు నెలలుగా 300 యూనిట్ల వాడకం లేనప్పటికీ తమకు తల్లికి వందనం పథకం నిలిపివేశారని ఆరోపిస్తూ పెద్ద సంఖ్యలో మహిళలు సోమవారం స్థానిక పిఠాపురం రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్‌కు తరలివచ్చారు. వేసవి కాలంలో ఎండలు మండిపోవడం, అదే సమయంలో శుభకార్యాలు జరగడంతో ఒక్క మే నెలలో మాత్రమే 300 యూనిట్ల బిల్లు వచ్చిందని, దానిని సాకుగా తీసుకోవడం ఎంత వరకూ సమంజసమని నిలదీశారు. ఆరు నెలల సరాసరి తీసుకొని 300 యూనిట్లు దాటితే తల్లికి వందనం నిలిపివేసినా అభ్యంతరం లేదని అన్నారు. అనేక మందికి 4 నుంచి 14 వరకూ మీటర్లు ఉన్నట్లు స్టేట్‌మెంట్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరో వాడుకుంటున్న విద్యుత్ మీటర్లు తమ పేరిట ఉండటమేమిటని ప్రశ్నించారు. ఇలా ఉన్న మీటర్లను గుర్తించి, బాధితుల పేర్లు తొలగిస్తామని ఏపీ ఈపీడీసీఎల్ ఏఈ రమేష్ కుమార్ చెప్పారు. ఆధార్ కార్డుల ప్రాతిపదికన విద్యుత్తు బిల్లులకు సంబంధించి అదనపు మీటర్లు ఉన్నట్లు గుర్తిస్తే రూ.30 చెల్లించి స్టేట్‌మెంట్ తీసుకోవడం ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి తొలగిస్తామని తెలిపారు. దీంతో, ఈ స్టేట్‌మెంట్ల కోసం విద్యుత్ వినియోగదారులు ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద బారులు తీరారు. విద్యుత్తు వాడుతున్న వారు వారి ఆధార్ కార్డులతో మీటరుకు లింక్ చేయించుకోవాలని ఏఈ సూచించారు. ఈ మేరకు విద్యుత్తు మీటర్లకు ఆధార్ లింక్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. విద్యుత్తు వాడకం 300 లోపు యూనిట్లు ఉన్నవారికి స్టేట్‌మెంట్లు అందజేస్తామని చెప్పారు. అయితే, తల్లికి వందనం అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 20వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని, ఆలోగా విద్యుత్ వాడకానికి సంబంధించిన స్టేట్‌మెంట్లు రాకపోతే తమకు అన్యాయం జరుగుతుందని తల్లులు ఆవేదన చెందుతున్నారు.

ధాన్యం బకాయి సొమ్ము చెల్లించాలని వినతి

అమలాపురం రూరల్: గత మే నెలలో రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు విక్రయించిన ధాన్యానికి బకాయిలు విడుదల చేసి ఆదుకోవాలని కోరుతూ కోనసీమ రైతు పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ మహేష్ కుమార్ కు వినతిపత్రం అందించారు. సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యాళ్ల బ్రహ్మానందం, అయితాబత్తుల ఉమా మహేశ్వరరావు, మంగెన నరసింహారావు, ఎరుబండి లక్ష్మయ్య, అప్పారి చినవెంకటరమణ, పెమ్మిరెడ్డి సత్యనారాయణ తదితరులు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ 45 రోజులుగా ధాన్యం సొమ్ము రాలేదని వారు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సూమారు రూ.250 కోట్లకుపైగా ధాన్యం బకాయిలు ఇవ్వాలని వారు తెలిపారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కోనసీమ రైతు పరిరక్షణ సమితి నాయకులు

ప్రభుత్వ ఉద్యోగి జీతమైనా ఇవ్వండి



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

- సంక్షేమ పథకాలైనా అమలు చేయండి
- కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల ధర్నా

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): అంగన్‌వాడీల కార్యకర్తలకు ప్రభుత్వ ఉద్యోగుల స్థాయిలో వేతనాలైనా ఇవ్వాలని, లేదంటే సంక్షేమ పథకాలయినా అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. కలెక్టర్ షణ్మోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు జి.బేబీరాణి, దడాల పద్మ మాట్లాడుతూ, చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల ముందు కూటమి పెద్దలు మ్యానిఫెస్టోలో పేర్కొన్నారని, నేడు అధికారంలోకి రాగానే అంగన్‌వాడీలను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సాధికార సర్వేలో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేసి, తప్పు చేశారని, ఇప్పటికే పని గంటలు పెంచి విపరీతమైన పని ఒత్తిడి పెంచారని చెప్పారు. ఆయాకు రూ.7 వేలు, టీచరుకు రూ.11,500 చెల్లిస్తూ ప్రభుత్వోద్యోగులుగా చెప్పడానికి కూటమి ప్రభుత్వానికి సిగ్గనిపించడలేదా అని ప్రశ్నించారు. అంగన్‌వాడీ కుటుంబాల్లోని పిల్లలకు తల్లికి వందనం డబ్బులు వేయకపోవడమే కాకుండా వృద్ధాప్య, దివ్యాంగ పింఛన్లు ఆపేశారని, వితంతు పింఛన్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇస్తున్న వేతనంతో అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు వండి పెట్టేందుకు, సెంటర్ అద్దెలకు పెట్టుబడి పెడుతూ, కార్యకర్తల కుటుంబాలు పస్తులుండాల్సి వస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి మలకా రమణ, వర్కింగ్ కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకట రమణ, పలివెల వీరబాబు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

మెట్టలో మట్టి మాఫియా

- కె.గోపాలపురంలో భారీగా తవ్వకాలు
- రోజూ 50 టిప్పర్లతో రవాణా
- ఛిద్రమవుతున్న రహదారులు



కె.గోపాలపురం వద్ద పొక్లెయిన్‌తో టిప్పర్‌లోకి ఎర్రమట్టి లోడింగ్



ఎర్రమట్టి తవ్వేసిన చోట ఏర్పడిన పెద్ద గొయ్యి

గండేపల్లి: మెట్టలో మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా పెద్దపెద్ద లారీలతో మట్టి తరలించుకుపోతూ అక్రమార్కులు రూ.లక్షలు కొల్లగొడుతున్నారు. మెట్ట, చెరువు.. ఇలా ఎక్కడ అవకాశముంటే అక్కడ గెద్దల్లా వాలిపోతూ.. నేలతల్లికి తూట్లు పొడుస్తున్నారు. గండేపల్లి మండలం కె.గోపాలపురంలో కొద్ది రోజులుగా మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. నర్సరీల్లో ఎర్రమట్టికి అధిక గిరాకీ ఉండటంతో అక్రమార్కుల కన్ను ఈ ప్రాంతంలోని ఎర్రమట్టిపై పడింది. గ్రామ శివారున సర్వే నంబర్ 1/1లో కొద్ది రోజుల క్రితం గుట్టు చప్పుడు కాకుండా భారీ టిప్పర్లలో మట్టి తరలించుకుపోగా.. ఇప్పుడు సర్వే నంబర్ 209లో ఎర్రమట్టి విచ్చలవిడిగా తవ్వేసి, తరలించుకుపోతున్నారు. మట్టి తవ్వకాలు పొక్లెయిన్ సైతం వినియోగిస్తున్నారు. తవ్విన మట్టిని తరలించేందుకు కొండలను సైతం పిండి చేసి, దర్జాగా బాటలు కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కో టిప్పర్ మట్టికి సుమారు రూ.10 వేల నుంచి దూరాన్ని బట్టి రూ.20 వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఈ విధంగా ప్రతి రోజూ సుమారు 50 టిప్పర్లతో మట్టి తరలించుకుపోతున్నారు. కళ్ల ముందే ఈ దందా జరుగుతునప్పటికీ ఇటు రెవెన్యూ, అటు అటవీ అధికారులు పట్టించుకోవడం లేదు. భారీ మొత్తాలు చేతులు మారుతున్నందువల్లనే చూసీచూడనట్లు వదిస్తేన్నారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎర్రమట్టి కోసం కొంత మంది రైతులకు డబ్బు ఆశ చూపి, పంట భూములను సైతం గుల్ల చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో, తమ పొలాలు కూడా పాడవుతున్నాయని చుట్టుపక్కల రైతులు వాపోతున్నారు. గతంలో డి-పట్టా భూముల రైతుల అవసరాలను సైతం అనుకూలంగా మార్చుకుని, అక్కడి కొండను తవ్వేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హడలెత్తుతున్న గ్రామస్తులు

కె.గోపాలపురం నుంచి మట్టి టిప్పర్లు ఎస్‌టీ రాజాపురం మీదుగా జాతీయ రహదారికి చేరుకుంటున్నాయి. ఆ టిప్పర్లను డ్రైవర్లు మితిమీరిన వేగంతో రేయింబవళ్లు నడుపుతూండటంతో ఆ గ్రామస్తులు హడలెత్తుతున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక లోడుతో మట్టి టిప్పర్లను నడుపుతూండటంతో ఆ మార్గంలో నేల అదిరిపోతోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో, తమ ఇళ్లు, గోడలు బీటలు తీసి, కుంగిపోతాయేమోనని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు అధిక లోడు వల్ల రోడ్లు ఛిద్రమవుతున్నాయి. మట్టి తవ్వకాలకు మైనింగ్ అధికారులే అనుమతులు ఇవ్వాల్సి ఉంటుందని, తాము ఎటువంటి అనుమతీ ఇవ్వలేదని, అక్రమ తవ్వకాలపై చర్యలు చేపడతామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. మట్టి మాఫియాకు వెంటనే కళ్లెం వేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- రత్నగిరిపై సత్రాలకు ఎట్టకేలకు మరమ్మతులు
- రూ.1.20 కోట్లతో పనులు
- రెండు నెలల్లో పూర్తి

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో ఈ సత్రాల మరమ్మతులు ఎట్టకేలకు సోమవారం ప్రారంభమయ్యాయి. రూ.1.20 కోట్లతో న్యూ సెంటినరీ, ఓల్డ్ సెంటినరీ, ప్రకాష్ సదన్ సత్రాల్లో ఈ పనులు ప్రారంభించారు. ఈ పనులను ఈఓ వీర్ల సుబ్బారావు పరిశీలించారు. ఆయా సత్రాల్లో చేపడుతున్న పనుల గురించి ఆయనకు ఈఈ వి.రామకృష్ణ వివరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, టెండర్ షరతుల ప్రకారం ఈ మూడు సత్రాల్లో మరమ్మతులు పూర్తి చేయడానికి మూడు నెలల గడువుందని చెప్పారు. అయితే రెండు నెలల్లోనే పూర్తి చేసి, భక్తులకు అందుబాటులోకి తేవాల్సిందిగా ఈఓ ఆదేశించారన్నారు. ఆ మేరకు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ప్రస్తుతం మూఢమి, దానికి తోడు ఈ నెల 26 నుంచి ఆషాఢ మాసం కావడంతో వివాహాది శుభ కార్యక్రమాలు జరగవు. అందువలన ఈ సమయంలో భక్తులు పెద్దగా రారు. మళ్లీ జూలై 25 నుంచి శ్రావణ మాసం ప్రారంభమవుతుంది. అప్పటి నుంచి భక్తుల రాక ప్రారంభమవుతుంది. ఆలోగా సత్రాల మరమ్మతులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

సగం గదుల్లో సమస్యలు

దేవస్థానంలో హరిహర సదన్, శివసదన్, న్యూ సీసీ, ఓల్డ్ సీసీ, ప్రకాష్ సదన్, శ్రీ సీతారామ సత్రం, కొండ దిగువన సత్యనికేతన్ సత్రాలున్నాయి. వీటిల్లో ఏసీ, నాన్ ఏసీ గదులు 620 ఉన్నాయి. వీటిలో సుమారు 120 గదులు పాడై, అద్దెకిచ్చేందుకు ఏమాత్రం వీలుగా లేవు. మరో 150 గదుల్లో ఫర్నిచర్, బాత్‌రూమ్ ఫిట్టింగ్స్ సరిగా లేవు. ప్రకాష్ సదన్ వంటి సత్రాల్లో బస చేసిన భక్తులు ఆ గదుల్లో ఉండలేక రాత్రికి రాత్రే ఖాళీ చేసిన సందర్భాలు కోకొల్లలు. వీటికి మరమ్మతులు చేయించాలని చాలా కాలం నుంచి భక్తులు కోరుతున్నా అధికారులు పట్టించుకోలేదు. గత ఏడాది అప్పటి ఈఓ, ప్రస్తుత దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ సత్రాల గదులకు మరమ్మతులు చేయించాలని నిర్ణయించి, అంచనాలు రూపొందించారు. తొలుత రూ.40 లక్షలతో హరిహర సదన్ సత్రంలో గదులకు మరమ్మతులు పూర్తి చేసి, రంగులు వేయించారు. తరువాత న్యూ సెంటినరీ, ఓల్డ్ సెంటినరీ, ప్రకాష్ సదన్ సత్రాలకు మరమ్మతులు చేయించాలని నిర్ణయించి, రూ.40 లక్షల చొప్పున అంచనాలు రూపొందించి, టెండర్లు ఖరారు చేశారు.

- ఓల్డ్ సెంటినరీ సత్రం: దీనిని నిర్మించి సుమారు 30 సంవత్సరాలైంది. ఇందులో 48 గదులున్నాయి. పెళ్లి బృందాల వారు ఇక్కడ గదులు రిజర్వ్ చేసుకుని, సత్రం ఆవరణలో వివాహాలు చేసుకుంటారు. ఈ సత్రం గదులకు పెయింట్లు వేసి చాలా కాలమైంది. డోర్లు, కిటికీలు, వాటర్ పైప్‌లైన్లు, బాత్‌రూముల్లో ఫిట్టింగ్స్ పగిలిపోయాయి. నీరు లీకవుతూండటంతో డ్రైనేజీ పైప్ లైన్లకు నాచు పట్టింది. కొన్నిచోట్ల భవనానికి పగుళ్లు ఏర్పడ్డాయి.
- న్యూ సెంటినరీ సత్రం: సుమారు 28 ఏళ్ల కిందట నిర్మించిన ఈ సత్రంలో కూడా 48 గదులున్నాయి. వివాహాది శుభకార్యాలకు భక్తులు గదులు రిజర్వ్ చేసుకుంటారు. ఇందులో కూడా ఓల్డ్ సెంటినరీ సత్రం మాదిరిగానే సమస్యలున్నాయి.
- ప్రకాష్ సదన్ సత్రం: వీఐపీ సత్రంగా పేరొందిన ఈ భవనాన్ని 2000 సంవత్సరంలో ప్రారంభించారు. 86 గదులున్నాయి. గదికి రూ.వెయ్యి చొప్పున రోజుకు రూ.86 వేల మేర అద్దె రూపంలో ఆదాయం వస్తుంది. స్వామివారి ఆలయానికి దగ్గరగా ఉండటం, దగ్గర్లోనే క్యాంటీన్, పార్కింగ్ సదుపాయాలుండటంతో ఈ సత్రంలో బస చేయడానికి భక్తులు ఎక్కువగా ఆసక్తి చూపుతారు. ఇందులోని పలు గదుల్లో కూడా మరమ్మతులు చేయాల్సి ఉంది.



మరమ్మతులను పరిశీలిస్తున్న ఈఓ సుబ్బారావు. చిత్రంలో ఈఈ రామకృష్ణ తదితరులు

క్లుప్తంగా

'సార్... ఇలా చేశారు'

నర్సింగ్ బదిలీలలో మాయాజాలంపై ఆర్‌డీ కలెక్టర్‌కు వివరణ

కాకినాడ క్రైం: నర్సింగ్ బదిలీలలో నర్సింగ్ అసోసియేషన్ అగ్రనాయకత్వ మాయాజాలంపై కలెక్టర్ షణ్మోహన్ సీరియస్ అయ్యారు. బదిలీల ప్రయోజనాలను పొందేందుకు అసోసియేషన్ ఎన్నికల్లో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన వారి పేర్లకి బదులు ఇతరులవి చేర్చడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్‌డీ డాక్టర్ పద్మశశిధర్‌ని ఆరా తీశారు. ఈ ఉదంతంపై పూర్తి వివరాలివ్వాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో వివాదానికి సంబంధించి ఆది నుంచీ చోటు చేసుకున్న ప్రతి అంశాన్ని ఆర్‌డీ వివరణాత్మకంగా కలెక్టర్‌కు అందించారు. ఉన్నతాధికారులనే బురిడీ కొట్టించిన ఈ వ్యవహారంపై కలెక్టర్ అప్రమత్తమయ్యారు. తమకందుతున్న వివిధ యూనియన్ల లెటర్లలోని ఆఫీస్ బేరర్ల పేర్లను క్షుణ్ణంగా పరిశీలించాలని, నిర్ధారించుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కాగా కలెక్టర్ సూచనల మేరకు బాధ్యులపై చర్యలు చేపడతామని డాక్టర్ పద్మశశిధర్ అన్నారు.

పాత కక్షల నేపథ్యంలో ఇరు వర్గాల ఘర్షణ

ఆలమూరు: మండల కేంద్రమైన ఆలమూరులో ఇరు వర్గాల మధ్య పాత కక్షల నేపథ్యంలో ఘర్షణ జరిగింది. స్థానిక ఎస్సై ఎం.అశోక్ కథనం ప్రకారం స్థానిక పెద్ద కాలువ రోడ్డులోని ఎర్రకాలనీ వద్ద పలివెల తేజ, కొమ్ము రోహిత్ వర్గాల మధ్య ఆదివారం రాత్రి పరస్పర దాడులు జరిగాయి. ఈ దాడుల్లో హత్యా ప్రయత్నం జరిగిందంటూ ఒకరిపై ఒకరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలకు చెందిన 14 మందిపై పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



అనపర్తిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రవిచంద్రకుమార్

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని రేకుల షెడ్డులో మేడిశెట్టి వెంకటరమణ (44) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు అని ఎస్‌ఐ వాసంశెట్టి రవి చంద్ర కుమార్ సోమవారం తెలిపారు. ఊలపల్లి గ్రామానికి చెందిన మేడిశెట్టి వెంకటరమణ పందలపాక కోదండ రామ రైస్‌మిల్లులో కూలీగా పని చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం మద్యం తాగడానికి ఇంట్లో రూ.100 అడిగాడు. ఇవ్వకపోవడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. తాను పని చేసే రైస్‌మిల్లు ఎదురుగా ఉన్న షెడ్డులోకి వెళ్లి ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో రుమాలుతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఆయన కుమారుడు అజిత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని అనపర్తి సీహెచ్‌సీకి తరలించి, పంచానామా అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్ తరువాత కోర్సుల ఎంపికే కీలకం

- మూడు, నాలుగేళ్లు కష్టపడితే ఆనందమయ జీవితం
- సంప్రదాయ డిగ్రీ కోర్సులతోనూ ఉపాధి

రాయవరం: ఇంటర్ తర్వాత ఏ కోర్సు చదవాలి! ఏ రంగంలో స్థిరపడాలనే సందేహాలు విద్యార్థుల మెదళ్లను తొలిచేస్తుంటాయి. తల్లిదండ్రులు, స్నేహితుల ఒత్తిడి మేరకు నిర్ణయం తీసుకోకుండా విద్యార్థులు ఇష్టమైన కోర్సును ఎంపిక చేసుకుంటే భవిష్యత్తు ఆనందంగా ఉంటుంది. ఈ ఏడాది జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 9,246 మంది ఉత్తీర్ణత సాధించారు. సప్లిమెంటరీ పరీక్షల్లో 1,576 మంది ఉత్తీర్ణత సాధించారు. విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల్లో మన జిల్లాకు చెందిన మరో ఆరు వేల మంది విద్యార్థులు పరీక్షలు రాసి ఉత్తీర్ణత పొందారు. వీరిలో 70 శాతం మేరకు ఇంజినీరింగ్ విద్యను అభ్యసించేందుకు సిద్ధమవుతున్నట్టు అంచనా. ఇంటర్ తరువాత అందుబాటులో ఉన్న కోర్సులు ఇవీ..

వైద్య విద్య

ఇంటర్లో బైపీసీ చదివేవారు వైద్యవిద్య అభ్యసించేందుకు అవకాశముంది. నీట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా ఎంబీబీఎస్ సీటు లభిస్తుంది. వైద్య విద్య పూర్తి చేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వ వైద్యులుగా ఉద్యోగం పొందే అవకాశాలు అధికంగా ఉంటాయి. బీడీఎస్ పూర్తి చేసి దంత వైద్యులుగా స్థిరపడవచ్చు.

సీఏతో

సీఏ (చార్టర్ అకౌంటింగ్) మంచి ఉపాధినిచ్చే కోర్సు. ఇంటర్ తరువాత సీపీటీ ప్రవేశ పరీక్ష ఉంటుంది. దీనిలో అర్హత సాధించి, ఐపీసీఏలో చేరవచ్చు. ఇది నాలుగున్నర సంవత్సరాల కోర్సు.

ఇంజినీరింగ్

జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్‌డ్, ఏపీ ఈఏపీసెట్లో ఇంజినీరింగ్ కోర్సులకు ప్రాధాన్యం అధికం. ఇందులో కంప్యూటర్ సైన్స్, ఈసీఈ, మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్, ఈఈఈ, ఏఐ, ఐటీ తదితర కోర్సులు ఉన్నాయి. ఐఐటీ, ఎన్ఐటీలో చేరి ఇంజినీరింగ్ చేస్తే డిగ్రీ పూర్తయ్యేలోగా వివిధ కంపెనీల నుంచి ఆఫర్లు వస్తున్నాయి. మన రాష్ట్రంలో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో కోర్సులు పూర్తి చేసిన వారికి క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆఫర్లు వస్తున్నాయి.

కామర్స్ కోర్సులు

బ్యాచిలర్ ఆఫ్ కామర్స్‌ను బీకామ్ ఆనర్స్ అని కూడా పిలుస్తారు. ఇంటర్‌లో కామర్స్ చదివిన విద్యార్థులకు ప్రాధాన్యమిస్తారు. కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో బీకామ్ ప్రవేశానికి సీయుఈటీ పరీక్షను రాయాల్సి ఉంటుంది. బ్యాంకింగ్, బీమా రంగాల్లో కెరీర్‌ను ఎంచుకోవాలనుకునే విద్యార్థులు బీకామ్ అకౌంటింగ్, టాక్సేషన్ తీసుకోవాలి. బీకామ్ కోర్సు పాఠ్యాంశాల్లో ఇండియన్ టాక్స్ సిస్టమ్, ఫైనాన్సియల్ అకౌంటింగ్, వాల్యూయాడెడ్ టాక్స్, సెంట్రల్ టాక్స్ ప్రొసీజర్, ప్రిన్సిపల్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్, బిజినెస్ కమ్యూనికేషన్ ఉంటాయి. బీబీఏ, బీసీఏ, సీఏ, సీఎస్ తదితర వృత్తి పరమైన కోర్సులను చదవడానికి వీలుంది.



ఇంటర్ విద్యార్థులు

డిగ్రీతో బోలెడు అవకాశాలు

సీయూ సెట్ రాసి జాతీయ స్థాయిలో ప్రాధాన్యం గల విశ్వవిద్యాలయాల్లో హ్యూమన్ సైన్సు కోర్సులు చదవచ్చు. మన రాష్ట్రంలో బీఏతో పాటు బీకాం జనరల్, కంప్యూటర్ కోర్సులకు డిమాండ్ ఉంది. బీఎస్సీ కంప్యూటర్ కోర్సుకు కూడా డిమాండ్ ఉంది.

డిగ్రీ చదివే విద్యార్థులకు నైపుణ్యాల పెంపుపై వివిధ యూనివర్శిటీలు దృష్టి సారించాయి. ఇప్పుడిప్పుడే క్యాంపస్ ఇంటర్వ్యూలలో డిగ్రీ చదివే విద్యార్థులు కూడా అవకాశాలు పొందుతున్నారు. ఉపాధ్యాయ వృత్తిలోకి వెళ్లాలనుకునేవారు డీఈడీ పూర్తి చేసి అవకాశాలు పొందవచ్చు. న్యాయవాద వృత్తిలో స్థిరపడాలనుకునే విద్యార్థులు ఐదేళ్ల కోర్సులకు చెందిన ప్రవేశ పరీక్షలు రాసి ఇంటర్ తరువాత న్యాయ విద్యను అభ్యసించవచ్చు.

ఫార్మసీకి ప్రాధాన్యముంది

ఔషధ రంగ పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ఫార్మసీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. అవకాశాలు విస్తృతంగా ఉంటాయి. ఏపీ ఈఏపీసెట్‌తో బి-ఫార్మసీ ప్రవేశాలు జరుగుతాయి. ఇది పూర్తి చేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ ఆఫీసర్, హాస్పిటల్ ఫార్మాసిస్టులుగా ఉద్యోగాలు లభిస్తాయి.

వ్యవసాయం, ఉద్యానం

ఏపీ ఈఏపీసెట్‌తోనే బీఎస్సీ అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ చదివే అవకాశం ఉంది. నాలుగు సంవత్సరాల ఈ కోర్సులు పూర్తి చేస్తే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి మార్గాలు ఎక్కువగా ఉన్నాయి.

నర్సింగ్‌తో స్వయం ఉపాధి

ఇంటర్ బైపీసీ విద్యార్థులకు నర్సింగ్ చక్కని అవకాశం. ఈ కోర్సుతో స్వయం ఉపాధి పొందడమే కాకుండా రోగులకు సేవ చేసే అవకాశం ఉంటుంది. ఇంటర్ తరువాత నాలుగేళ్ల కోర్సును ఎంపిక చేసుకుంటే మహిళలకు మంచి అవకాశాలు ఉంటాయి. రెండేళ్ల ఫిజియోథెరపీ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి.

ఫైన్ ఆర్ట్స్‌తో ఉజ్వల భవిత

పెయింటింగ్, శిల్పకళ, ప్రింట్ మేకింగ్, విజువల్ కమ్యూనికేషన్, ఫొటోగ్రఫీ, గ్రాఫిక్ డిజైన్, ఆర్ట్ హిస్టరీ వంటి విభాగాల్లో శిక్షణ పొందడానికి ఫైన్ ఆర్ట్స్ కోర్సులు ఉపకరిస్తాయి. ఫైన్ ఆర్ట్స్‌లో డిగ్రీ లేదా డిప్లమా పూర్తి చేసిన అనంతరం విద్యార్థులు గ్యాలరీలు, మ్యూజియం, మీడియా సంస్థలు, విద్యారంగం తదితర రంగాల్లో ఉద్యోగాలు పొందడానికి వీలుంటుంది.

డిగ్రీ కోర్సులతో ఉపాధి



ఇంటర్ తర్వాత డిగ్రీ కోర్సులతో ఉపాధి పొందడానికి వీలుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఎంప్లాయిబిలిటీ కోర్సులు ప్రవేశ పెట్టారు. వీటికి డిమాండ్ పెరుగుతోంది. సంప్రదాయ డిగ్రీ కోర్సులతో పాటుగా, ఆక్వా కల్చర్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్ కోర్సులను కలిపి డిగ్రీ చేసుకునే వెసులుబాటు ఉంది.

– డాక్టర్ సీహెచ్ రామకృష్ణ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామచంద్రపురం

బ్రాందీషాపు ఏర్పాటును నిరసిస్తూ ధర్నా



పెదపట్నంలో బ్రాందీ షాపు ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

మామిడికుదురు: పెదపట్నం గ్రామంలోని ఏటిగట్టు ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా బ్రాందీ షాపు ఏర్పాటుకు నిరసనగా సోమవారం స్థానికులు ధర్నా చేశారు. బ్రాందీ షాపు ఎదురుగా నిల్చుని నిరసన తెలిపారు. ఆలయం సమీపంలో నివాస గృహాల వద్ద బ్రాందీషాపు ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా నిరసించారు. గతంలో ఇదే విధంగా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నామన్నారు. అప్పట్లో ఈ షాపును వేరే చోట ఏర్పాటు చేశారని చెప్పారు. మళ్లీ ఇక్కడ బ్రాందీ షాపు ఏర్పాటు చేసేందుకు ప్రయతిస్తున్నారని అన్నారు. దీని వల్ల తాము నిత్యం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. బ్రాందీ షాపు ఏర్పాటు నిర్ణయాన్ని తక్షణం ఉప సంహరించుకోవాలని నినాదాలు చేశారు. నిరసనలో గెద్దాడ సందీప్, కుక్కల వేణు, గెద్దాడ సావిత్రి, చెల్లింగి సత్యనారాయణ, కుక్కల సక్కుబాయి, ముత్యాల సుబ్రహ్మణ్యం, కుక్కల నాగలక్ష్మి, అరిగెల కృష్ణవేణి, చెల్లింగి వరలక్ష్మి పాల్గొన్నారు.

గోదావరిలో స్నానానికి దిగిన యువకుడి మృతి

- రెండో రోజు ఒడ్డున మృతదేహం లభ్యం
- కలసి వెళ్లిన మిగిలిన ఆరుగురు మిత్రులు సురక్షితం



నరాల సాయికృష్ణ (ఫైల్)

కరప/ఐ పోలవరం: ఆదివారం సరదాగా గడపడానికి వెళ్లిన ఏడుగురు స్నేహితులు గోదావరిలోకి స్నానానికి దిగగా, ఒక యువకుడు గల్లంతు అయ్యాడు. మిగిలిన ఆరుగురు సురక్షితంగా బయటపడ్డారు. రెండో రోజు సోమవారం గోదావరి ఒడ్డున మృతదేహం లభ్యమైంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... కరప గ్రామానికి చెందిన నరాల సాయికృష్ణ(19) మరో ఆరుగురు స్నేహితులతో కల్సి ఆదివారం సరదాగా గడపడానికి మోటార్ సైకిళ్లపై యానాం వెళ్లి, అక్కడి నుంచి ఎదుర్లంక వంతెన దాటివెళ్లి గోదావరిలోకి స్నానానికి దిగారు. ఒకరికొకరు సాయపడి ఒడ్డుకు చేరడానికి తీవ్రంగా ప్రయత్నించారు. వీరిలో సాయికృష్ణ గల్లంతయ్యాడు. మిగిలిన ఆరుగురు ప్రాణాలతో బయటపడి, ఒడ్డుకు చేరుకున్నారు. ఆరుగురిని ఐ.పోలవరం పోలీసులు అదుపులోకి తీసుకుని, విచారణ జరుపుతున్నారు. గల్లంతైన సాయికృష్ణ మృతదేహం రెండో రోజు సోమవారం ముమ్మిడివరం సమీపంలో గోదావరిలో మునిగిపోయిన ప్రాంతంలోనే పైకి తేలింది. రెండురోజులుగా తాత నరాల కృష్ణ(వెంటూరు కృష్ణ), తండ్రి నరాల బుజ్జి, బంధువులతో కల్సి కన్నీరు, మున్నీరుగా విలపిస్తూ గోదావరి ఒడ్డునే ఉండిపోయారు. ఎలాగైనా బతికిబయట పడతాడని ఎదురుచూశారు. తీరా శవమై తేలడంతో తాత, తండ్రి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇంటికి వెళ్లి తన కూతురికి ఎలా చెప్పాలంటూ తాత కృష్ణ, తండ్రి బుజ్జి గుండెలు అవిసేలా విలపిస్తూ, కూలబడిపోయారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కరప మండల యూత్ అధ్యక్షుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పెంకే సత్తిబాబు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఘటనా స్థలానికెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించి, బాధితులకు అండగా నిలిచి, ధైర్యం చెప్పారు.

కరపలో విషాద ఛాయలు

సాయికృష్ణ మృతితో కరపలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అందరినీ నవ్విస్తూ, కలుపుగోలుతనంగా ఉండే సాయికృష్ణ లేడని తెలుసుకున్న స్నేహితులు, బంధువులు జీర్ణించుకోలేకపోతున్నారు. తల్లికి మరణవార్త తెలియనివ్వలేదు.

గోదావరిలో గల్లంతైన సాయికృష్ణ స్వగ్రామం కరప

గోదావరిలో గల్లంతైన యువకుడు నరాల సాయికృష్ణ స్వగ్రామం కరప. అతని తండ్రి బుజ్జి చిన్న హోటల్ నిర్వహిస్తాడు. తాత నరాల కృష్ణ భార్య కరప హైస్కూలులో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తుంటారు. తల్లి గృహిణి. వీరికి ఒక కుమారుడు సాయికృష్ణ ఇంటర్మీడియెట్ చదివాడు. కుమార్తె కరప హైస్కూలులో చదువుతోంది. కరప, శివారు రామకంచిరాజునగర్ కాలనీకి చెందిన ఆరుగురు స్నేహితులతో కల్సి యానాం మీదుగా వంతెన దాటి వెళ్లి గోదావరిలోకి స్నానానికి దిగారు. ఐ.పోలవరం ఎస్‌ఐ రవీంద్రబాబు పర్యవేక్షణలో ఎస్‌డీఆర్ఎఫ్ బృందాల గాలింపులో సోమవారం సాయంత్రం సాయికృష్ణ మృతదేహం లభ్యమైంది.

మార్కెట్‌లోకి సుజుకి కొత్త స్కూటర్



స్కూటర్‌ను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న సర్వారాయుడు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని కంటిపూడి సుజుకి షోరూంలో సోమవారం కంటిపూడి గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు సుజుకి న్యూ యాక్సెస్ 125 సీసీటీఎఫ్‌టీ ఎడిషన్ స్కూటర్ మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూ వీలర్ విక్రయ రంగంలో సుజుకి ఆక్సెస్ నెంబర్ వన్ స్థానంలో ఉందని. కొత్తగా లాంచ్ చేసిన టీఎఫ్‌టీ వాహనానికి సరికొత్త హంగులు, అధునాతన సౌకర్యాలు ఏర్పాటు చేశారన్నారు. కలర్ డిజిటల్ మీటర్, వెదర్ అలర్ట్, నావిగేషన్, మెసేజ్ అలర్ట్, వాట్సాప్ కాల్, మైలేజ్ రేంజ్, డెమో నైట్ మోడ్ లాస్ట్ పార్కింగ్ అలర్ట్, స్పీడ్ ఎక్సీడింగ్ అలెర్ట్ వంటి సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ స్కూటీ అన్ని వర్గాలతో పాటు యువతకు ఆకర్షణీయంగా ఉంటుందని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైందని, డ్రైవింగ్‌కు సులువైందని నాణ్యతలో సాటిలేని స్కూటర్ అని అన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ కె.వినయ్‌బాబు, ఎం.జగన్, సీహెచ్ సత్యనారాయణమూర్తి (చినబాబు), కె.మన్మోహన్‌రామ్, జి.ఎం రాజారావు, కస్తమర్లు, నగర ప్రముఖులు, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

కన్నుల పండువగా సాహితి అరంగేట్రం

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాట్య శిక్షణాలయం జ్యోతి కళా క్షేత్రం స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నృత్య గురువు జ్యోతిరెడ్డి శిష్యురాలు సాహితీ పద్మప్రియ కూచిపూడి నాట్య రంగ ప్రవేశం సోమవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా పుష్పాంజలి, జతిస్వరం, అలరింపు, వర్ణం, థిల్లాన వంటి అంశాలపై చక్కటి హావభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇన్‌కమ్‌ట్యాక్స్ ఆనంద్ రాజేశ్వర్ బైవార్ మాట్లాడుతూ.. నేటి తరానికి శాస్త్రీయ సంగీత కళలపై మక్కువ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తూ శాస్త్రీయ కళలపై మక్కువ పెంచుకున్న సాహితి రాబోయే రోజుల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇన్‌కమ్‌ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఆర్‌వీ రెడ్డి, ఇన్‌కమ్‌ట్యాక్స్ (ఇన్వెస్టిగేషన్) ప్రైమరీ డైరెక్టర్ రాజ్‌గోపాల్ శర్మ తల్లిదండ్రులు మానస్, ఐఆర్ఎస్ ఏపీ బాబు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న సాహితి

వెబ్‌సైట్‌లో ఎంపికైన అభ్యర్థుల జాబితా

కాకినాడ క్రైం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో గత ఏడాది జనవరి 21వ తేదీన కాకినాడ రంగరాయ వైద్య కళాశాల విడుదల చేసిన ఉద్యోగాల నోటిఫికేషన్‌కి సంబంధించిన అభ్యర్థుల తుది ఎంపిక పూర్తయిందని ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్ సోమవారం రాత్రి ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలను ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు వెబ్‌లో తమ పేర్లను పరిశీలించుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఎంపికైన అభ్యర్థులు తమకు నిర్దేశించిన ఉద్యోగ కేంద్రాలకు అనుగుణంగా కాకినాడ ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ కార్యాలయం, అదే ఆవరణలో ఉన్న నర్సింగ్ కళాశాలలోని ప్రిన్సిపాల్ కార్యాలయం, కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయాలలో 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు విద్యార్హత ధ్రువపత్రాలను పరిశీలనకు ఇచ్చి, పరిశీలన అనంతరం నియామక ఉత్తర్వులు పొందాలని డాక్టర్ విష్ణువర్ధన్ సూచించారు.

పెద్దాపురంలో వ్యక్తి దారుణ హత్య



హతుడు శ్రీనివాస్ (ఫైల్)

పెద్దాపురం: పట్టణ శివారు కట్టమూరు పుంత ప్రాంతంలో ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కిర్లంపూడి మండలం గోనేడ గ్రామానికి చెందిన జానకి సత్య శ్రీనివాస్ (వెంకన్నబాబు) (32)ను ఎవరో దారుణంగా హత్య చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... మృతుడు ఓ రైస్‌మిల్లులో పని చేస్తున్నాడు. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో ఉన్న శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందినట్లు భావిస్తున్నారు. పదునైన ఆయుధంతో మెడపై బలంగా కొట్టి చంపినట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహం వద్ద పగిలిన బీర్ బాటిళ్లు ఉండడంతో వివాహేతర సంబంధమే హత్యకు కారణమా.? మద్యం మత్తులో ఎవరైనా హత్య చేశారా? మరే ఇతర కారణం ఏదైనా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు శ్రీనివాస్‌పై గతంలో హత్య, హత్యాయత్నంతో సహా పలు కేసులు ఉన్నట్లు సమాచారం. పెద్దాపురం పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తును ప్రారంభించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని ఎస్‌ఐ మౌనిక తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపుపై ఫిర్యాదు

బిక్కవోలు: అదనపు కట్నం కోసం వేధింపుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రంగాపురం గ్రామానికి చెందిన కేతా విజయదుర్గాదేవి ప్రసన్నకు జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన సూరంపూడి నాగ హనుమంతరావుతో ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహం జరిగింది. వీరు రాజమహేంద్రవరంలో ఉంటున్నారు. అప్పటి నుంచి ఆమె భర్త ఆమెపై అనుమానంతో మానసికంగా, శారీరంగా వేధిస్తున్నాడు. పెళ్లి సమయంలో రూ.1.80 లక్షల నగదు, 3 కాసుల బంగారం, అర కిలో వెండి కట్నంగా ఇచ్చారు. అది సరిపోదు, ఇంకా కావాలని ఆమె భర్తతో పాటు అత్తమామలు, బంధువులు వేధిస్తున్నట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి216లోని పోలేకుర్రు వై.జంక్షన్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలతోపాటు మరొక వ్యక్తికి గాయాలయ్యాయి. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు మురమళ్లకు చెందిన మిస్సుల జగదీష్, అతని భార్య నాగకాళీ దుర్గా అనసూయ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో స్కూటర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. మరొక వ్యక్తికి కూడా గాయాలైనట్లు ఎస్సై తెలిపారు. క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొట్లాటకు నిలయాలుగా బ్రాందీషాపులు

కోరుకొండ: మండలంలోని బ్రాందీషాపులు కొట్లాటలు, ఘర్షణలకు నిలయాలుగా తయారయ్యాయి. తాజాగా ఆదివారం రాత్రి జరిగిన కొట్లాటలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. కోరుకొండ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జంభూపట్నం బ్రాందీషాపు వద్ద ఇద్దరు యువకులు గాయపడ్డారు. పశ్చిమగానుగూడెం గ్రామానికి చెందిన కాటుమళ్ల రాజశేఖర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు తలపై బీరు సీసాలతో కొట్టారు. గాధరాడకు చెందిన చంద్రమళ్ల మహేష్ తలపై గుర్తుతెలియని వ్యక్తులు బీరుసీసాలతో మోదారు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వీరు ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సైనాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

తాళ్లరేవు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ స్నేహలత సస్పెన్షన్



సస్పెన్షన్‌కు గురైన స్నేహలత

తాళ్లరేవు: స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ఆర్. స్నేహలతను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు తాడేపల్లి విజిలెన్స్ విభాగం డీఎస్‌హెచ్ నుంచి ఉత్తర్వులు ఆస్పత్రికి అందాయి. ఈ నెల 14వ తేదీన ఆస్పత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కోరంగి పంచాయతీ పెదబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన చెక్కా మాధురికి రెండో కాన్పుగా జన్మించిన పసికందు మృతి చెందింది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి చెందిన బంధువులు, గ్రామస్తులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. సూపరింటెండెంట్ స్నేహలత, స్టాఫ్ నర్సుల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ మృతి చెందిందని, వారిని విధుల నుంచి తొలగించాలని కోరుతూ ధర్నా చేశారు. ఈ నేపథ్యంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, కాకినాడ ఆర్డీఓ ఎస్.మల్లిబాబు, కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆందోళనకారులతో మాట్లాడి, విచారణ నిర్వహించి వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా ఆదేరోజు బాధ్యులైన నర్సులను సస్పెండ్ చేయగా, సూపరింటెండెంట్ స్నేహలతను సోమవారం సస్పెండ్ చేశారు. ప్రసవానికి ముందు కేసును సరిగ్గా అనుసరించకపోవడం, రోగికి జ్వరం ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడం, అటెండర్ల కాల్‌కు వెంటనే స్పందించకపోవడం, కేసు షీట్‌ను ఉద్దేశ పూర్వకంగా తారుమారు చేయడం, విధుల్లో నిర్లక్ష్యం తదితర కారణాలతో సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.